## క్లుప్తంగా

### అనారోగ్య బాధితులకు వితరణ



రామకృష్ణకు నగదు అందిస్తున్న యాదవ సంఘ నాయకులు

**మలికిపురం:** మండలంలోని లక్కవరంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మందపాటి రామకృష్ణకు రాజోలు తాలూకా యాదవ సంక్షేమ సంఘం ఆర్థిక సహాయం అందించింది. సంఘం సమకూర్చిన రూ.38 వేల నగదును ఆదివారం గ్రామంలో సంఘ పెద్దలు రామకృష్ణకు అందించారు. ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చిన దాతలను సంఘ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన సంఘ నాయకులు పాల్గొన్నారు.

### అగ్నిబాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



పల్లిపాలెంలో నాగరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**సఖినేటిపల్లి:** మండలంలోని పల్లిపాలెంలోని అగ్నిబాధితుడు బొమ్మిడి నాగరాజు కుటుంబాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద రావు ఆదివారం పరామర్శించారు. ఈ మేరకు నగదు రూ.5 వేలు ఎమ్మెల్యే అతడికి అందజేశారు. ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా ఆదుకుంటామని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ లోన్ మంజూరయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే అన్నారు. వెంట నాయకుడు కేఎస్ఎన్ రాజు, సర్పంచ్ ఒడుగు శ్రీను, ఎంపీటీసీ పోతాబత్తుల భాస్కరరావు పాల్గొన్నారు.

### ఉమ్మడి జిల్లా షూటింగ్ బాల్ జట్ల ఎంపిక



జిల్లా షూటింగ్ బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

**కొత్తపేట:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు శనివారం కొత్తపేట కాంతిభారతి హైస్కూల్ ఆవరణలో జరిగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, ఎంఎస్‌డీఓ వైఏ స్ఎస్ ఉషారాణి పర్యవేక్షణలో బాలురు, బాలికలకు షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని 30 పాఠశాలల నుంచి సుమారు 95 మంది క్రీడాకారులు హాజరయ్యారు. డిసెంబర్‌లో అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని పీడీ ఏఎస్ఎస్ రమాదేవి తెలిపారు. వచ్చిన క్రీడాకారులు, పీడీ, పీఈటీలకు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, కాంతి భారతి హైస్కూల్ డైరెక్టర్ తోట సత్యవాణి తదితరులు భోజన వసతి కల్పించారు.

### అన్న సమారాధన

**పి.గన్నవరం:** జి.పెదపూడిలో కొలువుదీరిన వైష్ణవి కనకదుర్గమ్మ ఆలయం వద్ద దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సంధిపూడిలో..**

**ఆలమూరు:** మండలంలోని సంధిపూడిలో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. స్థానిక వంతెన వద్ద వేంచేసిన విజయదుర్గా అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు, గ్రామస్తుల సహకారంతో ఈ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అన్నదానాన్ని స్వీకరించారు.

### మార్షల్ ఆర్ట్స్‌లో అన్విష్ వర్మకు బంగారు పతకం



**మలికిపురం:** కెనడాలోని కాల్గరీలో ఈ నెల 16 నుంచి 22 వరకూ జరిగిన ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్‌లో మలికిపురానికి చెందిన భూపతిరాజు అన్విష్‌వర్మ బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఈ మేరకు కెనడా నుంచి వర్మ విలేకరులతో మాట్లాడారు. 2018లో గ్రీస్ ప్రపంచ చాంపియన్ షిప్‌లో, 2019లో ఆస్ట్రియాలో జరిగిన ప్రపంచ చాంపియన్ షిప్‌లో బంగారు పతకాలు సాధించానన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశం తరఫున పాల్గొని పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు.

### నిత్యాన్నదానానికి విరాళం

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదానానికి రాజమహేంద్రవరం బొమ్మూరుకు చెందిన ఈమని శ్రీఆద్య కుటుంబ సభ్యులు రూ.10,116లు విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ సొమ్ము ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందజేశారు. దాతను ఆలయ వేదపండితులు సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

# ఆద్యంతం... మనోహరం

- భేతాళుని వాహన మహోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



గంగలకుర్రు మలుపులో చెడీ తాలింఖానాను ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు



గంగలకుర్రు మలుపులో విజయగణపతికి విద్యుత్ దీపాలంకరణ



వాహనంపై కొలువుతీరిన శ్రీకృష్ణుడు

**అంబాజీపేట:** శరన్నవరాత్రుల అనంతరం అంబాజీపేటలో జరిగే విజయభేతాళ వాహన మహోత్సవం ఆద్యంతం మనోహరంగా సాగింది. 1967లో ప్రారంభించిన ఈ వాహన మహోత్సవం నేటికి 57 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పటికీ అదే సంప్రదాయ రీతిలో సాగింది. 13 పాలాలకు చెందిన వివిధ రకాల గ్రామమూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ స్థానిక సెంటరులో కొలువుదీరి భక్తులను కనువిందు చేశాయి. అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే భేతాళస్వామి సంబరాలు ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ అట్టహాసంగా, కనులవిందుగా సాగాయి. శ్రీనివాసనగర్‌లో వేంచేసిన విజయభేతాళ స్వామి ఆలయం వద్ద నుంచి ఆధ్యాత్మిక సంబరాలు ప్రారంభమయ్యాయి. 13 పాలేల నిర్వాహకులు దేవతామూర్తులను వాహనాలపై పెట్టి రంగురంగుల విద్యుత్‌దీపాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మేళతాళాలు, బాజాభజంత్రీల పురవీధుల్లో ఊరేగించారు. వాహనాల ముందు చెడీ తాలింఖానా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు చేసిన విన్యాసాలు గగుర్పాటుకు గురిచేశాయి. గరగ నృత్యాలు, కోబ్రా, శక్తి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్థానిక సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై ఎ.చైతన్యకుమార్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవ మూర్తులను ఎంపీ చింతా అనురాధ, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు దర్శించుకున్నారు.

**కొలువుతీరిన వాహనాలివే..**

శ్రీనివాస్‌నగర్ నుంచి గరుత్మంతుడు, పెచ్చెట్టివారిపాలెం నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామ్‌నగర్ నుంచి సింహం వాహనం, దొమ్మేటివారిపాలెం శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి దొమ్మేటివారిపాలెం ఆంజనేయస్వామి, పోతాయిలంక ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు విజయగణపతి, మాచవరం ఇటికాలమ్మ గుడి నుంచి హంస వాహనం, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడివారిపాలెం నుంచి శ్రీషిరిడిసాయిబాబా, గుత్తులవారిపాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి రాజరాజేశ్వరిదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు ఈ ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు కనువిందు చేశాయి.

## జనం మెచ్చిన పాలన జగన్‌కే సాధ్యం



అంతర్వేదిపాలెంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

**సఖినేటిపల్లి:** రాష్ట్రంలో జనం మెచ్చిన పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం అంతర్వేది పాలెం మామిడితోట కాలువగట్టు ప్రాంతంలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. అలాగే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు ఈద రవిరెడ్డి, నల్లి సురేంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకులు నల్లి త్రిమూర్తులు, గెడ్డం అమ్ములు, మోకా ఏసురాజు, కోనపల్లి వెంకటేశ్వరరావు, కుసుమ చింటూ, కె.అశోక్, ఆర్.వెంకట్ పాల్గొన్నారు.

## వైభవంగా దుర్గమ్మ ప్రతిష్ఠా మహోత్సవం



పెదపట్నంలంకలో జరిగిన ఘటాభిషేకంలో పాల్గొన్న ముత్తైదువలు

**మామిడికుదురు:** పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మ 32వ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి ఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. సుమారు 116 మందికి పైగా ముత్తైదువలు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. పెదపట్నం గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ గంటి శ్రీనివాసు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి ఆలయం వద్ద గణపతి పూజ, పుణ్యాహవాచనం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా వైనతేయ గోదావరి నదికి వెళ్లారు. అక్కడ గోదావరి నదీ తీరంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపించారు. తదుపరి కనకదుర్గమ్మకు లక్ష కుంకుమార్చన, లలితా హోమం నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది.

## జల్‌జీవన్ మిషన్‌తో తాగునీటి సమస్య పరిష్కారం



లూటుకుర్రులో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తాతకాపు

**మామిడికుదురు:** జల జీవన్ మిషన్ నిధులతో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని సర్పంచ్ అడబాల తాతకాపు పేర్కొన్నారు. లూటుకుర్రు జగనన్న కాలనీలో రూ.24 లక్షలు వ్యయంతో నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు సర్పంచ్ తాతకాపు ఆదివారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలోని ప్రతి ప్రాంతానికి జల జీవన్ మిషన్ నిధులతో తాగునీటి పైప్‌లైన్ నిర్మిస్తున్నామన్నారు. గ్రామంలో జఠిలంగా ఉన్న తాగునీటి సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పొన్నమండ ధనలక్ష్మి, పాలూరి పెద్దిరాజు, బోణం అబ్బులు పాల్గొన్నారు.

## మూగబోయిన విద్యుత్ సబ్‌స్టేషన్ ఫోన్లు

**అంబాజీపేట:** ఏడాదిగా అంబాజీపేట, ముక్కామల విద్యుత్ సబ్ స్టేషన్లలో ఉన్న ల్యాండ్ ఫోన్లు మూగబోయాయి. ఏదైనా విద్యుత్ సమస్యలు సంబంధించినప్పుడు, సమాచారం తెలుసుకునేందుకు వినియోగదారులు ల్యాండు లైన్‌కు ఫోన్ చేస్తే వారికి నిరాశే ఎదురవుతుందని వాపోతున్నారు. ఫోన్ రింగ్ అవుతుందని ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ వైర్లు తెగిపడి ప్రమాదం సంభవిస్తే ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా ల్యాండ్ ఫోన్‌లు పనిచేయడం లేదని ఆ శాఖ ఉన్నతాధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని వినియోగదారులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నా పట్టించుకోకుండా గాలికొదిలేశారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ల్యాండ్ ఫోన్లు పనిచేసేలా చర్యలు తీసుకుని వినియోగదారులకు సహకరించాలని కోరుతున్నారు.

## దేశ ఐక్యత చాటేందుకే 'నా మట్టి–నా దేశం'

**మలికిపురం:** దేశ ఐక్యత చాటేందుకే నా దేశం–నా మట్టి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస్ నగేష్ తెలిపారు. నా మట్టి–నా దేశంలో భాగంగా జిల్లాలో ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టిని కలశాలలో పొందుపరిచి ఆదివారం విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీకి జిల్లా నుంచి నాయకులు తీసుకుని తరలి వెళ్తున్న నేపథ్యంలో ఆదివారం ఆయన మండలంలోని మేడిచర్ల పాలెంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఈ మట్టిని ఢిల్లీలో ప్రత్యేకంగా తయారుచేసిన అమృత వనంలో వేసి దేశంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఐక్యతగా ఉన్నారని చాటి చెప్పడం ఉద్దేశమని ఆయన తెలిపారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి మేడిచర్ల చాణక్య ఉన్నారు.

**ఢిల్లీకి బయలుదేరిన బీజేపీ నేతలు**

**రావులపాలెం/అయినవిల్లి:** ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమంలో రావులపాలెం, అయినవిల్లి మండలాల నుంచి సేకరించిన మట్టి కలశంతో ఆయా బీజేపీ నాయకులు ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు. గ్రామ గ్రామానా సేకరించిన మట్టిని అమృత కలశాలతో ఢిల్లీ యాత్రకు వెళుతున్నట్టు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పొనుగుపాటి శ్రీనివాస్ తెలిపారు.

**ఆలమూరు:** మండలంలోని ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టితో కూడిన కలశాలను మండల కేంద్రమైన ఆలమూరు నుంచి విజయవాడ మీదుగా ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. పార్టీ శ్రేణులు చేపట్టిన అమృత కలశయాత్రకు అపూర్వ స్పందన లభించిందని ఆ పార్టీ నియోజకవర్గ నేత అయినవిల్లి సత్తిబాబు గౌడ్ తెలిపారు. మండల శాఖ అధ్యక్షులు నాగిరెడ్డి స్వామి, తోరాటి ఆంజనేయులు, వడ్డి దొరయ్య నాయుడు, మేడపాటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కొబ్బరిలో ఈస్ట్‌కోస్టల్ అధిక దిగుబడులు

**అంబాజీపేట:** ఈస్ట్ కోస్టల్ కొబ్బరి చెట్ల నుంచి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని రావేప్ విద్యార్థులు రైతులకు వివరించారు. అంబాజీపేట, వానపల్లిలో ఈస్ట్‌కోస్టల్ కొబ్బరి మొక్కలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రావేప్ విద్యార్థులు మాట్లాడుతూ నాణ్యమైన కొబ్బరి మొక్కను ఎంచుకుని సకాలంలో నాటితే తెగుళ్లు, పురుగుల బారిన పడకుండా కొబ్బరి పొత్తులు త్వరగా వస్తాయన్నారు. కొబ్బరి మొక్కలు నాటే సమయంలో శాస్త్రవేత్తల సలహాలను తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. 10 నెలల ఈస్ కోస్టల్ మొక్కలు అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకుని నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో రావేప్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

### ఆర్‌టీసీ సిబ్బందిపై దాడులు ఖండిస్తూ నిరసన

**రావులపాలెం/రాజోలు:** బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్లే ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులోని డ్రైవర్ బలరాం సింగ్‌పై కావలి పరిసర ప్రాంతంలో కొందరు మూకుమ్మడిగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ రావులపాలెం, రాజోలు ఆర్టీసీ డిపో జేఏసీ ఉద్యోగులు అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆదివారం నిరసన తెలిపారు. 24 గంటలు నిరంతరం ప్రయాణికుల భద్రత యోగక్షేమాల కోసం శ్రమిస్తూ, ప్రయాణికుల కోసం శ్రమిస్తూ ఉండే ఒక వాహన చోదకుడిపై దాడిని వారు ఖండించారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన అల్లరి మూకలను గుర్తించి అరెస్టు చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. దాడి చేసిన అల్లరి మూకలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొని ప్రజల క్షేమమే తమ ధ్యేయంగా భావించే ఆర్టీసీ ఉద్యోగులపై మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు.

### ఘనంగా అష్టోత్తర పూజలు

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం స్వామి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు.

### నేటితో ముగియనున్న జగనన్న ఆరోగ్య సురక్ష

**ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో గత నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు సోమవారంతో ముగియనున్నాయని తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని మూలస్థాన అగ్రహారం-2 గ్రామ సచివాలయంలో సోమవారం సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైద్య నిపుణులు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించే ఈ సురక్ష శిబిరాన్ని గ్రామ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### విఘ్నేశ్వరుని సన్నిధిలో డీఎస్పీ దంపతులు



విఘ్నేశ్వరుని సన్నిధిలో వెంకటరమణ దంపతులు

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వర స్వామిని కొత్తపేట డీఎస్పీ వెంకటరమణ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసిన డీఎస్పీ వెంకటరమణ దంపతులను ఆలయ వేదపండితులు వేద మంత్రాలతో సత్కరించి, స్వామివారి శేషవస్త్రాలు, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట స్థానిక ఎస్సై సురేష్‌బాబు ఉన్నారు.

## క్వాయర్ ఉత్పత్తులతో ఆర్థిక స్వావలంబన



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న ఏడీ అపర్ణలక్ష్మి

**మామిడికుదురు:** క్వాయర్ ఉత్పత్తుల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండీ క్రాఫ్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అపర్ణలక్ష్మి సూచించారు. ఈదరాడలో ఆదివారం హ్యాండీ క్రాఫ్ట్స్ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొబ్బరి పీచుతో బొమ్మల తయారీతో పాటు కొబ్బరి ఆధారిత పరిశ్రమల ద్వారా మహిళలు జీవనోపాధి పొందుతున్నారని అపర్ణలక్ష్మి పేర్కొన్నారు. ఇది మంచి పరిణామమని ఆమె పేర్కొన్నారు. పురుషుల కన్నా మిన్నగా కష్టపడి పని చేస్తూ ఆదాయం ఆర్జించడం ముదావహమన్నారు. నాబార్డు ఏజీఎం వై.సోమునాయుడు మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం పెరిగిందన్నారు. హ్యాండీక్రాఫ్ట్స్ ఉభయ రాష్ట్రాల మెగా క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధీర్ మాట్లాడుతూ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కొబ్బరి పీచుతో బొమ్మల తయారీపై శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాలాజీని దర్శించుకున్న విద్యాశాఖ ఏడీ



అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకుంటున్న విజయలక్ష్మి

**మామిడికుదురు:** అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం కలిపారు. ఏడీ విజయలక్ష్మి శ్రీదేవి, భూదేవి సమేతం బాలబాలాజీ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో పాటు కాకినాడ డీఈఓ ఆఫీస్ ఏఎస్‌ఓ కె.వెంకటేశ్వరరావు, ఏపీఓ వి.సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి కామేశ్వరరావు బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు స్వామి వారి శేషవస్త్రం బహూకరించి, మహాదాశీర్వచనం అందించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యుడు కొమ్ముల సూరిబాబు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ చిక్కం సత్యప్రసాద్, ఉపాధ్యాయుడు రామ్‌ప్రసాద్ ఉన్నారు.

## రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం



పసుపల్లిలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

**అంబాజీపేట:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పసుపల్లిలో సర్పంచ్ మట్టపర్తి నాగరాజు అధ్యక్షతన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గడపగడపకూ కార్యక్రమంలో గ్రామానికి సంబంధించి రూ.20 లక్షలు మంజూరయ్యాయన్నారు. వీటితో గ్రామానికి అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లను నిర్మించనున్నామన్నారు. రహదారుల నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, నాయకులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



చెముడులంకలో నాటి గురువులను ఘనంగా సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

**ఆలమూరు:** నాలుగు దశాబ్దాల క్రితం చదువుకున్న విద్యార్థులందరూ ఒక వేదికపై కలుసుకుని ఆలింగనం చేసుకుంటూ అనురాగం, ఆప్యాయతలను పంచుకున్నారు. ప్రస్తుతం పెద్ద తరహా జీవన శైలిని అనుభవిస్తున్న వారంతా ఒక్కసారిగా విద్యార్థి దశలోని యవ్వన ప్రాయానికి వెళ్లిపోయారు. జ్ఞాపకాల దొంతరలను నెమరువేసుకుని నాటి చిలిపి అల్లరిని, గురువులతో తిన్న చీవాట్లను గుర్తుకు తెచ్చుకున్నారు. మండలం చెముడులంక ఎస్‌టీఎస్‌ఎన్‌ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1977–82 మధ్య కాలంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. సుమారు 47 మంది విద్యార్థుల్లో దాదాపు 40 మంది నాటి విద్యార్థులు కుటుంబ సభ్యులతో వచ్చి అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్నారు.

**గురువులకు ఘన సత్కారం**

నాడు విద్యా బోధన చేసి జీవితానికి బాట వేసిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. విలువలతో కూడిన విద్యను అందించి తమ ఉన్నతికి విశేష కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు గన్ని ప్రసాద్, రామలింగేశ్వరరావు, కీర్తి రామం తదితరులకు పూలమాలలు వేసి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించి మెమెంటోను బహూకరించారు. తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేశారు.


## ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

**రావులపాలెం:** విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు పోగొట్టుకున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.10,500 ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కొత్తపేట మండలం ఏనుగులమహల్ గ్రామానికి చెందిన మట్ట గోవింద్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. పనిలోకి వెళ్లినప్పుడు కరెంటు వైర్లు తగిలి షాక్ కొట్టి రెండు చేతులు కోల్పోయాడు. రెండు చేతులు లేకపోవడం వలన పనికి వెళ్లలేక కుటుంబ పోషణ కష్టంగా మారింది. దీంతో సాయం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను కోరారు. గోవిందుకి రూ.10,500 కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులు చేతుల మీదుగా అందజేశారు.

## అయినవిల్లి.. ఆధ్యాత్మికతతో శోభిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల రద్దీ

**అయినవిల్లి:** సకల శుభాలివ్వు విఘ్నేశ్వరా అంటూ ఆ గణనాథుడిని భక్తజనం కొలిచింది. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఉదయం ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి మేలుకొలుపు సేవ చేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. గరిక పూజ, పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 65 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 185 మంది, నూతన వాహన పూజ ఆరుగురు జరిపించుకున్నారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,05,236 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

## టీచర్ ప్రభావతికి 'గురుస్పందన' పురస్కారం



ఏలూరులో ప్రభావతిని సత్కరిస్తున్న ప్రముఖులు

**సఖినేటిపల్లి:** సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్, ఏపీ ఎన్‌జీసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గుండేపల్లి ప్రభావతికి, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆదివారం గురు స్పందన పురస్కారంతో సత్కరించింది. ఈ మేరకు ఏలూరులో అతిథి ఇంటర్నేషనల్ హోటల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమెకు ప్రముఖులు అవార్డు ఇచ్చి శాలువాతో సత్కరించారు. విద్యాబోధనతో పాటు చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా పై అవార్డుకు ఎంపిక చేసినట్టు ప్రభావతి స్థానిక మీడియాకు తెలిపింది. సంస్థ అధ్యక్షుడు ఈదా శామ్యూల్‌రెడ్డి, ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, ఏలూరు డీఈవో శ్యాంసుందర్ పాల్గొన్నారు.